క్లుప్తంగా

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి బైబిల్ పై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ఆ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షులు సజ్జా ఎలియాజర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన యువకులు ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చికి వచ్చి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్‌పర్సన్ సజ్జా జ్యోతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వివిధ రంగాలలో ప్రతిభ ఉండి గుర్తించి ఉగాది పర్వదినం సందర్భంగా సర్వేజనాఃసుఖినో భవంతు ఆధ్వర్యంలో ఉగాది విశిష్టప్రతిభా రత్న పురస్కారంతో సత్కరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభా వంతులు వారి ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, వివరాలతో ఈ నెల 20వ తేదీలోపు సంస్థ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లో ఉగాది విశిష్ట ప్రతిభారత్న పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా పురస్కారంతో సత్కరిస్తామని పేర్కొన్నారు. సమాచారం కోసం 96523 47207లో సంప్రదించాలని ఆయన కోరారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు కళ్లే నాగేశ్వరరావు, కళ్లే సీతామహాలక్ష్మీ పాల్గొని ముందుగా కళ్లే లలితా విగ్రహానికి నివాళులర్పించారు. ట్రస్ట్ సభ్యులు హరిష్, జస్విన్, దుర్గారావు, మహేష్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో రూ.లక్ష చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ మెచ బ్లాక్‌కు చెందిన జాన్యవుల విజయలక్ష్మి ఇంట్లో శనివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో రూ.లక్ష నగదు, బంగారపు వస్తువులు దొంగిలించికెళ్లినట్టు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు విజయలక్ష్మి శనివారం సాయంత్రం పెళ్లికి వెళుతూ ఇంటికి తలుపులు దగ్గరకు వేసి, బయటగేటు వేసి వెళ్లింది. మరో గంట తర్వాత వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన రూ.లక్ష, బంగారపు వస్తువులు లేనట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారని పేర్కొంది. పోలీసులు కుసే నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందా మహాలక్ష్మి(21) శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు ప్రగతినగర్‌కు చెందిన ఫిర్యాది పొట్నూరి రాజా కుమార్తెకు మంగళగిరికి చెందిన చందా వినోద్ కుమార్‌కు మూడున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మహాలక్ష్మి రెండో బిడ్డను ప్రసవించి ఐదు నెలలుగా ప్రగతి నగర్లోని పుట్టింటి వద్ద ఉంటోంది. వినోద్‌కుమార్ తన కొడుకును రోజూ మంగళగిరి తీసుకెళ్లి, తీసుకొస్తూవుండగా భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ విషయంలో భర్త తన మాటను లెక్కచేయడంలేదని ఈ నెల 10వ తేదీన మహాలక్ష్మి ఇంట్లోనే ఫ్యానుకు చీరతో ఉరేసుకుంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చగా శనివారం రాత్రి ఆమె చనిపోయింది. మృతురాలి తండ్రి రాజా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నార్త్ తహసీల్దారు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శవ పంచనామ చేశారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కొరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగర ఆటోకార్మికులు పండిట్ నెహ్రూ బస్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఒక పక్క పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ఆటో రంగం కుదేలవుతుంటే మరొపక్క సీఎన్‌జీ గ్యాస్ ధరలను పెంచడం మూలిగే నక్కపై తాటికాయ పడినట్టుగా ప్రభుత్వం తన విధానాలను సాగిస్తోందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి శంకర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్.ఆంజనేయులు, సాంబశివరావు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం కోసమే వైఎస్సార్ సీపీ ఏర్పాటు

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజన్న రాజ్యాన్ని మళ్లీ తీసుకు రావాలనే సంకల్పంతో 12 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పార్టీనే వైఎస్సార్ సీపీ అని పలువురు నేతలు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



రాణిగారితోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పటమటలంకలోని వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్‌కట్‌చేశారు. పార్టీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్‌షేక్, నాయకులు వేగే వాణిప్రసాద్, వల్లూరి ఈశ్వరప్రసాద్, సుబ్బ రాజు, కడియాల నాగు పాల్గొన్నారు.

-ఏడో డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి ఆధ్వర్యంలో శిఖామణిసెంటర్‌లో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతకాన్ని ఆవిష్కరించి కేక్‌కట్‌చేశారు. మెరకనపల్లి కుటుంబరావు, ఉదయ్, సంపత్, సుధీర్, ఆనంద్, ఆశోక్, చంద్రిక పాల్గొన్నారు.

-19వ డివిజన్ లబ్బీపేటలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు బుర్రి జగజ్జీవన్‌రావు, నాయకులు చింతగుంట విజయ్‌ఆనంద్‌కుమార్, ఎస్‌కే వలీ, మైనార్టీ విభాగం నగర జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ బాషా పాల్గొన్నారు.

డివిజన్లలో..

కృష్ణలంక(విజయవాడ తూర్పు): 17, 18, 21, 22 డివిజన్లలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ రాణిగారితోటలో ఐస్ ఫ్యాక్టరీ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి, 21వ డివిజన్‌లో పలు చోట్ల వైఎస్సార్ చిత్రపటానికి, 22వ డివిజన్‌లో మలేరియా హాస్పిటల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు కడియాల బుచ్చిబాబు, 17, 18 డివిజన్ల కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, వెంకట సత్యనారాయణ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆరో డివిజన్‌లో..

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆరో డివిజన్ బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్ దగ్గర జరిగిన కార్యక్రమానికి దేవినేని అవినాష్ వైఎస్సార్ సీపీ జెండాను ఆదివారం ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ అమర్, పార్టీ నాయకులు కడియాల బుచ్చిబాబుతో పాటుగా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

డివిజన్ల పరిధిలో..

గుణదల (విజయవాడ తూర్పు): తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పలు డివిజన్లలో పార్టీ జెండా ఎగురవేసి సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు.

3వ డివిజన్‌లో..

స్థానిక కరెన్సీనగర్‌లో 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. భీమిశెట్టి బాబు, డేవిడ్ రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో..

డివిజన్ పరిధిలోని భారతీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, నాయకులు కడియాల బుచ్చిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

6వ డివిజన్‌లో..

స్థానిక బ్రహ్మానందరెడ్డి నగర్‌లో తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేదలకు పండ్లు పంచారు. కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో..

స్థానిక మసీదు సెంటర్‌లో తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేదలకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కడియాల బుచ్చిబాబు, మాగంటి నవీన్ పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, నల్లగేటు డౌన్‌లోని 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 15, 16 డివిజన్లలో ఘనంగా వేడుకలు జరిగాయి. 15వ డివిజన్‌లో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 16వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక ఆధ్వర్యాన పార్టీ జెండాలు ఎగరేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, మాజీ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి బహదూర్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, చిత్రంలో డాక్టర్ మెహబూబ్



పడవలరేవు సెంటరులో కేక్ కోస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



21వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్



శిఖామణి సెంటర్‌లో కేక్‌కట్ చేస్తున్న కార్పొరేటర్ మాధురి



పండ్లు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ అమర్‌నాథ్



వేడుకల్లో పాల్గొన్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



లబ్బీపేటలో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న బుర్రి జగజ్జీవన్‌రావు, వలీ



మూడో డివిజన్‌లో పార్టీ జెండాను ఎగురవేస్తున్న దేవినేని అవినాష్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుణదల(విజయవాడ తూర్పు): విద్యుత్ మరమ్మతులలో భాగంగా గుణదలలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులలో భాగంగా పిచ్చమ్మ హోటల్ సెంటర్, శ్రీరామ చంద్రనగర్, కరెన్సీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల మధ్య సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహరించాలని కోరారు.

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం చేయాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఏడు గంటలకు రామలింగేశ్వరనగర్‌లోని 15వ డివిజన్‌లో నిర్వహించనున్నట్లు డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమానికి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. డివిజన్‌లోని 68వ సచివాలయం పరిధిలోని స్క్రూబ్రిడ్జి నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



అవయవాల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం బందరు లాకుల సమీపంలోని స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో సుదీక్షణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రమాదంలో గాయపడి కాళ్లు చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ కాళ్లు, చేతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని 75 మందికి కృత్రిమ అవయవాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ సేవలకు తోడు సుదీక్షణ్ ఫౌండేషన్ లాంటి సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వ్యవస్థాపకురాలు చిగురుపాటి విమల, కోస్టల్ బ్యాంక్ అధికారులు మదన్ మోహన్, రామకృష్ణ, అట్లూరి విజయలక్ష్మి ప్యూర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శాంతి శ్రీ పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేకాట, కోడిపందేలు వంటి జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బాపులపాడు మండలం కె.సీతారామపురంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకోవటంతో పాటుగా, నాలుగు కోడి పుంజులు, రూ.3500 నగదు స్వాధీనపర్చుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టామని చెప్పారు. జూద శిబిరాల నిర్వహణపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళను వేదిస్తున్న వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన ఎండీ ఆశ గత కొద్దికాలం క్రితం ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుంది. అప్పు కొంత చెల్లించగా కొంత బాకీపడింది. అయితే ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగి నీరజ్ తరచుగా ఆశకు ఫోన్ చేసి వేదించటమే కాకుండా అసభ్యంగా మెసేజ్‌లు పెడుతూ ప్రవర్తించ సాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం తాడిగడప కాలువ కట్టకు చెందిన జుజ్జవరపు కావ్య రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన అనిల్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. అనిల్ కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. కాగా ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురమ్మని భర్తతో పాటు ఆడపడుచు మంజు, ఆమె భర్త నాగార్జున, మామ ప్రభాకరరావులు వేధిస్తుండంటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

మానసిక శాస్త్ర నిపుణులు కార్టూనిస్టులు

విజయవాడ కల్చరల్: మానసిక శాస్త్ర నిపుణులు కార్టూనిస్టులని సీనియర్ పాత్రికుడు ఘంటా విజయకుమార్ అన్నారు. మల్లెతీగ సాహిత్యవేదక ఆధ్వర్యంలో ఘంటా ఇందిర స్మారక జాతీయ స్థాయి కార్టూన్ ఫలితాల ప్రకటన కార్యక్రమాన్ని కృష్ణానదీ తీరంలో ఆదివారం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ కార్టూన్లు సామాజిక చైతన్యకలిగించి సామాజిక ప్రయోజనం కలిగించాలని సూచించారు. మల్లెతీగ సాహిత్య పత్రిక సంపాదకులు కలిమిశ్రీ ఉభయ రాష్ట్రాలలోని ప్రముఖ కార్టూనిస్టులు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ కార్టూనిస్ట్ బొమ్మన్‌కు రూ.10 వేల నగదు బహుమతి సత్కారం, ఐదు వందల నగదు బహుమతి పొందిన కార్టూన్ల విజేతలు, వల్లూరి కృష్ణ, ప్రసిద్ధ, హైదరాబాద్, చిదంబరం, ఆదినారాయణ, నాగిశెట్టి, మురళీధర్ విజయవాడ, జెన్నా విశాఖపట్టం, భూపతి కరీంనగర్, గోపాల కృష్ణ పెనుగోండ, డీ శంకర్ కోరుట్ల, ఎన్ శేషయ్య తిరుపతి, పైడి శ్రీనివాస్ వరంగల్, వినోద్ సఖిరేటిపల్లి, కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కే సంపత్, చొప్పా రాఘవేంద్ర ప్రసాద్, కుర్రా సురేష్‌బాబు, ఎజీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



విజేతల వివరాలు తెలియజేస్తున్న నిర్వాహకులు విజయకుమార్, రాఘవేంద్రరావు

ఎండీఎస్ సేవలు అభినందనీయం

మైనార్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ(ఎండీఎస్) ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. లబ్బీపేట దర్యగాహే ఇస్లామీ హైస్కూల్‌లో ఆదివారం ఎండీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతో ప్రజలకు వ్యాధుల స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. శిబిరంలో న్యూరాలజిస్టు డాక్టర్ నవీన్‌తోట, కార్డియాలజిస్టులు డాక్టర్ అనీల్‌కుమార్, డాక్టర్ ఫిలిప్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జరీనా, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ కోట, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జానీబాషా, డాక్టర్ రోహిత్‌లు పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కడియాల బుచ్చిబాబు, ఎండీఎస్ అధ్యక్షులు ఎస్‌కే వలీ, కార్పొరేటర్ రెహానా నాహిద్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం, ఎండీఎస్ సభ్యులు ముఖ్తార్ అలీ, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ అబీద్, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మందులు అందజేస్తున్న ఇంతియాజ్, అవినాష్ తదితరులు

మహిళల విజయాన్ని స్వాగతించాలి

ఏపీ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పుణ్యశీల

విజయవాడ కల్చరల్: మహిళల విజయాన్ని స్వాగతించాలని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ పుణ్యశీల రాజ్‌కుమార్ అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు, మహిళలకు స్వరాంజలి, సప్తస్వరాలు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పుణ్యశీల మాట్లాడుతూ సమాజ పురోభివృద్ధిలో మహిళల పాత్ర చిరస్మరణీయమైనదని తెలిపారు. ప్రభుత్వం మహిళా సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలను చేస్తోందని వారికోసం చిత్త శుద్ధితో పనిచేస్తునట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, కొప్పరపు ఉమాబలరాం, వడ్డాది కామేశ్వరి ప్రసంగించారు. చావా నరసింహారావు పర్యవేక్షలో సుధారాణి, భారతి, విష్ణుప్రియ, రూపాశ్రీ, అమలారాణి, సింధూ తదితరులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గాయనీమణులను నిర్వాహకులు సత్కరించారు.



మహిళలను సత్కరిస్తున్న పుణ్యశీల, విజయలక్ష్మి, ప్రసూనా రామన్

భగవద్గీతపై అవగాహన కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానసిక వికాసానికి మరింత బాటలు వేసేందుకు కర్తవ్య దీక్షను గుర్తు చేసే భగవద్గీతపై అవగాహన పెంచాలని గోవిందనామ ప్రచార సంఘం అధ్యక్షుడు మధుసూదన స్వామి అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో భగవద్గీత జ్ఞాన బోధ శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భగవద్గీత ఏ ఒక్క మతానికి చెందిన గ్రంథంగా భావించకూడదన్నారు. కులమతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాలకు మానవ జీవన ధర్మాన్ని బోధిస్తుందన్నారు. జీవితంలో ఎలా నడుచుకోవాలో తెలిపే మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు. గ్రంథాలయంలో భగవద్గీత శిక్షణ పొందుతున్న చిన్నారులకు బెంగళూరుకు చెందిన గీతా ప్రచారకులు కర్పూరం తిరుపతిరావు, రాహుల్, నివేదితలు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె రమాదేవి, సిబ్బంది పీవీవీ ఫణిబాబు, గోపాలరావు, జి.ఝాన్సీ, దుర్గాంబ, గీతా బోధకురాలు సునీత పాల్గొన్నారు.



గీత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు


గ్లకోమాపై అప్రమత్తత అవసరం



గ్లకోమాపై అవగాహనా ర్యాలీలో కంటి వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్లకోమా నిర్ధారణ జరిగిన రోగులు సకాలంలో వైద్య సాయం పొందాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఆక్టోపస్) రవిచంద్ర అన్నారు. ప్రపంచ గ్లకోమా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ అకాడమీ ఆఫ్ ఆప్తమాలజీ(వీఏఓ) ఆధ్వర్యంలో ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని రవిచంద్ర జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్లకోమాపై రోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో గ్లకోమా వీక్ 2023 పేరిట వారం రోజుల పాటు అవకాహనా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ కె నగేష్‌బాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఉచిత కన్సల్టేషన్ సర్వీస్ కార్డ్స్



ఉచిత కన్సల్టేషన్ కార్డును ఆవిష్కరించిన డాక్టర్ జి.సమరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదలకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను అందించేందుకు హరివిల్లు ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు కార్డును అందుబాటులోకి తెచ్చింది. ఆదివారం గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాల్లో హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫ్రీ కన్సల్టేషన్ సర్వీస్ కార్డును డాక్టర్ సమరం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరివిల్లు ఫౌండేషన్ పేదలకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రూపొందించిన కార్డు ఎంతో ఉపయోగమన్నారు. అనంతరం హరివిల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కార్యదర్శి ఎం.వి.శరత్‌కుమార్ మాట్లాడుతూ నేడు వైద్యం ఖరీదైనదిగా మారిపోయిందన్నారు. ఆ క్రమంలో పేదలకు వైద్య సాయం అందించాలని ఉద్దేశంతో హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్రీ కన్సల్టేషన్ సర్వీస్ కార్డ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు వల్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని 16మంది డాక్టర్ల ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా వైద్య పరీక్షల్లో 40 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. నాలుగు ల్యాబ్‌ల్లో 50శాతం వరకు ఫీజు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. కార్డు అవసరమైన పేదలు పూర్తి వివరాలకు చిట్టినగర్‌లోని తులసి హాస్పిటల్ నందు సంప్రదించాలని కోరారు.